RNI. No. TELTEL /2022/ 89348

మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు ది న ప త్రి క

సంపుటి : 4 సంచిక : 99 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | గురువారం, ఏప్రిల్,02, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-




## ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే..

# కఠిన చర్యలు: కేంద్రం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 01: సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిట కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. ఏమైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# హనుమాన్ జయంతికి పటిష్ట బందోబస్తు



హైదరాబాద్ సిటీ: నగరంలో ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 3,000 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# ఒకే ఒక రాజధాని...

## అమరావతికి ఇక తిరుగులేదు: సీఎం చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్,01:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌర వానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచపటం లో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటిం చారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాటో కూటమి నుంచి వైదొలగే యోచనలో అమెరికా...

# ట్రంప్ వ్యాఖ్యలు దేనికి సంకేతం?



**వాషింగ్టన్,ఏప్రిల్,01:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో సైనిక కూటమిపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటో ఒక 'కాగితపు పులి' అని అభివర్ణిస్తూ, కూటమి నుంచి వైదొలగే విషయం పునఃపరిశీలన స్థాయి కూడా దాటిపోయింది అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో సైనిక ఘర్షణ విషయంలో యూరప్ మిత్రదేశాలు మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు నాటో దేశాలు ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. ఈ విషయంలో మిత్రదేశాలు 'పిరికిపందలు' అంటూ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఘాటుగా పోస్ట్ చేశారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, నాటో నుంచి వైదొలగడం గురించి మాట్లాడుతూ, "అవును, ఈ విషయం గురించి ఇక ఆలోచించడానికేమీ లేదు. నేను నాటోను ఎప్పుడూ కాగితపు పులిగానే చూశాను, ఈ విషయం పుతిన్‌కు కూడా తెలుసు" అని స్పష్టం చేశారు. "మేం ఉక్రెయిన్ విషయంలో వారికి (నాటో దేశాలకు) అండగా నిలిచాం. కానీ ఇరాన్ విషయంలో వారు మాకు మద్దతుగా నిలవలేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా మద్దతు తెలిపారు. "మనకు అవసరమైనప్పుడు సైనిక స్థావరాలను నిరాకరించే మిత్రదేశాలతో కూటమి వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ప్రశ్నించారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ సైనిక స్థావరాలను, గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికాకు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. మిత్రదేశాల వైఖరితో 77 ఏళ్ల నాటి నాటో కూటమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఈ పరిణామాలపై ఇరాన్ విషయంలో బుధవారం రాత్రి ట్రంప్ జాతినుద్దేశించి ప్రసంగించనున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. దీంతో ఆయన ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# మోడీ, పినరయి విజయన్ ఒక్కటే..

## కేరళంలో ప్రచారంలో రేవంత్ రెడ్డి



కేరళం: ప్రధాని నరేంద్ర మోడీకి, పినరయి విజయన్‌కు తేడా ఏమీ లేదని కేరళంలో సమస్యలకు ఈ ఇద్దరే కారణం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇవాళ కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తరఫున రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ముట్టతార వద్ద నిర్వహించిన రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేరళం ప్రజలు తెలివైన వారు, చదువుకున్న వారు. ఇక్కడి ప్రజలు ప్రజలు మతతత్వ శక్తులను ఎప్పటికీ అనుమతించరన్నారు. మతతత్వ శక్తులు కేరళంలోకి ప్రవేశించకుండా ఇక్కడి ప్రజలు లక్ష్మణ రేఖ గీశారన్నారు. నరేంద్ర మోడీ, పినరయి విజయన్ ద్వారా కేరళం భవిష్యత్?ను అపహరించాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ నాయకులు తమ ఓటు బ్యాంకును పినరయి విజయన్?కు ట్రాన్స్ఫర్ అయ్యేలా చేస్తూ కేరళంలో కాంగ్రెస్ మిత్రపక్షాలు గెలవకూడదని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెట్టుబడులు తెచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించి.. కేరళంను అభివృద్ధి చేసేవారికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ తెలంగాణను దత్తత తీసుకున్నారని ఆమె చొరవ వల్లే ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోగలుగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ ఆశీర్వాదం ఆమె మద్దతుతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఇది కేరళం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం అని వచ్చిందన్నారు. కేరళం ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఇవాళ ఉదయం ఉదయం 9.30 గంటలకు నావీ లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు జరిగే రోడ్ షోలో పాల్గొన్న ఆయన.. 11 గంటలకు త్రివేండ్రంలోని భారతన్నూర్( దీష్ఘుతీఫ్ష్ఘుఅఅబతీ)లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ కు హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు పూవాచల్ వద్ద (కట్టక్కడ నుండి పూవాచల్ , వెల్లండ్ వరకు) రోడ్ షో లో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు అలప్పుజ(ూశ్రీఘజూజూబఓఘ) వద్ద కార్నర్ మీటింగ్ కు హాజరై అనంతరం ఎర్నాకులం చేరుకోనున్నారు.

## తెలంగాణ పంచాయతీలకు

# జాతీయ అవార్డుల పంట

### హర్షం వ్యక్తంచేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,ఏప్రిల్,01:** గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక "దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు" లో రాష్ట్రానికి చెందిన రెండు గ్రామ పంచాయతీలు (ువశ్రీఘఅస్ట్రఘఋఘూఘఎష్ట్రఘఎఫ్ం) జాతీయ అవార్డులను దక్కించుకున్నాయి. గుడ్ ఫర్ గవర్నెన్స్ విభాగంలో వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలం మోతుకుపల్లి గ్రామ పంచాయతీ పురస్కారం దక్కించుకుంది. గ్రామ స్థాయిలో పారదర్శక పరిపాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన ప్రతిభకు గుర్తింపు లభించింది. అలాగే సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికైంది. మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన కృషికి గాను ఈ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న పంచాయతీలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో రెండు విభాగాల్లో తెలంగాణకు అవార్డులు రావడం పట్ల పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క) హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం గర్వకారణం. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, మహిళా సాధికారత దిశగా మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనం అన్నారు. అవార్డులు అందుకున్న మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇలాంటి విజయాలు ఇతర పంచాయతీలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

# ఏపీ ప్రజలకు అభినందనలు: పొన్నం



**హైదరాబాద్,ఏప్రిల్,01:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బిల్లు ఆమోదించడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పున విభజన చట్టం 2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని.. వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ మేరకు ఇవాళ ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి ముఖ్య ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇవి తెలంగాణ అభివృద్ధికి కీలకమని ఆయన గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని దుయ్యబట్టారు. ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైంది కాదని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు.

# మీసేవల్లో సర్వీసు ధరల బాదుడు




**హైదరాబాద్,ఏప్రిల్,01:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల నిర్వహణ ఖర్చులు పెరగడం, నిర్వాహకుల విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ప్రభుత్వం సర్వీసు ధరలను పెంచుతూ అధికారికి ఉత్తర్వుల విడుదల చేసింది. తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం పెరిగిన ధరలు తక్షణమే అమలులోకి రానున్నాయి. ఆదాయ ధ్రువీకరణ పత్రం గతంలో రూ.45 నుంచి రూ.55 ఉండగా.. రూ.80కి చేరింది. కుల ధ్రువీకరణ పత్రం రూ.45 నుంచి 55 ఉంగా.. రూ.80కి, స్థానికత ధ్రువీకరణ పత్రం ) రూ.45 నుంచి రూ.55 ఉంగా..రూ.80కి, అదేవిధంగా జనన ధ్రువీకరణ పత్రం (ప్రింట్ ) గతంలో రూ.40 నుంచి 45 ఉండగా.. రూ.62కు పెంచారు. సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను విధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ మూడింటి ధరలను ఏకంగా 80 రూపాయలకు పెంచడం వల్ల మధ్యతరగతి, పేద వర్గాలపై ఆర్థిక భారం పడనుంది. మరోవైపు మీసేవ కేంద్రాల నిర్వాహకులు తమకు వచ్చే కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెరిగిన కరెంట్ బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది ఖర్చుల దృష్ట్యా ఈ పెంపు అనివార్యమని వారు అభ్యర్థించారు. ఒకేసారి 50 శాతం మేర సర్వీసు ఛార్జీలు పెంచడంపై సామాన్య ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## ఉచితాల వరదలో విజయ్..!

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి. విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది. కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీ గా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక 'సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది. విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు . దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు. ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది. అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు. అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది. తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు. ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లో స్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు. యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది...

# ప్రజలు సహకరిస్తే...సకల సౌకర్యాలు కల్పిస్తాం

## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి - 3వ డివిజన్ లో పర్యటన

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 01: రామగుండం నగర పాలక సంస్థ తరపున ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని,ప్రజలు కూడా తమ వంతు భాధ్యతగా చెత్త బయట పడవేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు బాటలో భాగంగా బుధవారం రామగుండం నగర పాలక సంస్థ మూడవ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ , వినాయక నగర్, దొడ్డి కొమురయ్య నగర్ , శ్రీ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ వడ్లూరి రవి , అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. కార్పొరేటర్ తో పాటు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ అధికారులు సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి జి సి బి , చైన్ జి సి బి , బాబ్ కాట్ యంత్రాలతో పెద్ద మురుగు నీటి కాలువలో పూడిక తొలగించారు. మేయర్ కాలువ గట్టు పై నుండి అధికారులకు ,సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పని పూర్తయిన తరువాతనే అక్కడి నుండి వెళ్లాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నగర పాలక సంస్థ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ , ట్రాన్స్ కో తదితర ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి వాడ వాడలా తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. తమ ఇంటి ముందు వీధి దీపాలు వెలగడం లేదని చెప్పిన వెంటనే అప్పటికప్పుడే అక్కడిక్కడే వీధి దీపాలు పెట్టించారు. సుమారు 10 వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. తమ డివిజన్ కు మంచి నీళ్ళు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని అన్నారు. ఇండ్ల మీద వేలాడుతున్న కరెంట్ తీగలను సవరించాలని ట్రాన్స్ కో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనులు నిర్వహించడంలో అధికారులకు సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. స్థానికంగా ఉన్న హోటళ్ల నిర్వాహకులు కాలువల్లో చెత్త పడవేస్తున్నారని ఫిర్యాదు చేయగా తక్షణమే వారికి నోటీసులు అందజేసి జరిమానా విధించాలని ఆదేశించారు. రోడ్ల మీద , కాలువల్లో చెత్త వేసినా వాటిని ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. స్వాగతం పలుకుతూ శాలువాలు , బొకే లకు బదులుగా నోటు పుస్తకాలు , విద్యార్థులకు ఉపకరించే వస్తువులను అందజేయడంతో వారిని ఆయన అభినందించారు. స్థానిక కార్పొరేటర్ వడ్లూరి రవి , స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు , ప్రశాంత్ నగర్ పెద్ద మనుషులు , శ్రీ నగర్ కాలనీ వైభవ్ టవర్స్ తరపున వెంకట్రావ్ , కాలనీ వాసులు భూపెల్లి శ్రీనివాస్ రావు , శ్రీ నగర వెల్ఫేర్ అసిసియేషన్ తరపున ప్రభాకర్ రావు, మాజీ ఆర్ పి త్రివేణి , కె వి ఆర్ వెజిటేబుల్స్ తరపున పది లాంగ్ నోట్ పుస్తకాలు వేర్వేరుగా అందజేయగా వినాయక నగర్ కాలనీ వాసుల తరపున నరేందర్ కలర్ చాక్ పీసులు మేయర్ కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర , ఇ ఇ పి వి రామన్ , డి ఇ ఇ లు అఫ్తాబ్, జగదీష్ , షాభాజ్ , ఎ ఇ లు జమీల్, మీర్, మనోజ్ , చంద్ర మౌళి , రాంజీ , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు మౌనిక , కిషోర్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్ లు నాగ భూషణం ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# భగవద్గీత కాంటెస్ట్ లో కృష్ణవేణి స్కూల్స్ విద్యార్థుల ప్రతిభ

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 01:ఇస్కాన్ భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్‌లో గోదావరిఖని కృష్ణవేణి స్కూల్స్ విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. ఇస్కాన్ నిర్వహించిన భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్ లో భాగంగా ఫిబ్రవరి 3న నిర్వహించిన ఆన్లైన్ పరీక్షలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పరీక్షలో 95% కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి, జిల్లా స్థాయి టాపర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని లోని కృష్ణవేణి స్కూల్స్ కు చెందిన 8వ తరగతి విద్యార్థి రిష్విక్ జిల్లా సెకండ్ టాపర్‌గా నిలిచి ప్రతిభ చాటాడు. ఈ విజయాన్ని పురస్కరించుకుని రిష్విక్‌కు సైకిల్ బహుమతిగా అందజేశారు. అదేవిధంగా స్కూల్ టాపర్స్ ఐదవ తరగతి విద్యార్థులు రోషన్, మన్విక్, శాన్వి,ఆరో తరగతి విద్యార్థులు అవంతిక, సహస్ర, 8వ తరగతి విద్యార్థులు దుర్గ శ్రీ, వాసవి, 9వ తరగతి విద్యార్థులు సమీక్ష, అన్వేష్ విద్యార్థులకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ బహుమతులను ప్రేమ్ రాజ్ చైతన్య విద్యార్థులకు ప్రదానం చేశారు.




ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, క్యాంపస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## గ్రంధాలయం ఏర్పాటుకు అనువైన భవనం పరిశీలన



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 01: గ్రంధాలయం ఏర్పాటు చేయడానికి అనువైన భవనం కొరకు విఠల్ నగర్ లోని సింగరేణి డిస్పెన్సరీ , పార్క్ ప్రక్కన గతంలో డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ విభాగం) నిర్వహించిన సింగరేణి క్వార్టర్ లను రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా ప్రభుత్వం నుండి గ్రంధాలయం అభివృద్ది కొరకు రూ 60.00 లక్షల నిధులు మంజూరయిన నేపథ్యంలో ఎం ఎల్ఎ సూచనల మేరకు అనుకూలమైన భవనం అన్వేషిస్తున్నట్లు మేయర్ తెలిపారు. విఠల్ నగర్ లో మూతపడిన సింగరేణి డిస్పెన్సరీ భవనం గ్రంధాలయం కొరకు కేటాయించాలని సింగరేణి అధికారులను కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భవనానికి మెరుగులు దిద్ది ఆధునిక డిజిటల్ లైబ్రరీ సదుపాయాన్ని పాఠకులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన వెంట కార్పొరేటర్లు ముస్తాఫా , షేక్ బాబు మియా , నాయకులు చుక్కల శ్రీనివాస్ తో పాటు నగర పాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి. రామన్ తదితరులు ఉన్నారు.

# సింగరేణి అర్జీ-1 ఓసీ-5లో లక్ష్యానికి మించి బొగ్గు రవాణ

## - అభినందించిన జిఎం లలిత్ కుమార్



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 01: సింగరేణి ఆర్.జి-1 ఓసి-5 ప్రాజెక్ట్ లో ఉద్యోగులు అత్యుత్తమ పనితీరుతో నిర్దేచించిన ఈ ఆర్థిక సంవత్సరం వార్షిక ఉత్పత్తి ఉత్పాదక లక్ష్యా సాధనలో కేటాయించిన లక్ష్యం 32 లక్షల టన్నులు, బొగ్గు రవాణాకు కేటాయించిన 33,39,798 లక్షల టన్నులకు గాను అదనంగా 34,09,365 లక్షల టన్నుల అత్యధిక రవాణా రికార్డును నెలకొల్పినట్లు సాధించడం జరిగినదని విశేషమన్నారు జిఎం లలిత్ కుమార్. ఇట్టి రికార్డును నెలకొల్పిన సందర్భంగా జియం డీ లలిత్ కుమార్ జిడికే ఓసి.5 ప్రాజెక్ట్ సందర్శించి ఉద్యోగులను, సూపర్వైజర్లను, అధికారులను, యునియన్ ప్రతినిధులను అభినందించి ఈ విజయానికి కారణమైన వారికి బహుమతులు అందజేసి అందరికి మిటాయిలు పంచిపెట్టారు. ఈ విజయానికి కారణమైన సింగరేణి డైరెక్టర్స్, చైర్మన్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ ఇది అందరి సమిష్టి కృషితో అత్యుత్తమ పనితీరుతో పరస్పర సహకారం, సమన్వయం, క్రమశిక్షణ, అంకితభావంతోనే ఈ రికార్డు సాధ్యమయిందని జియం ప్రశంసించారు. గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఇదే విధంగా వచ్చే ఆర్థిక సంవత్సారానికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను కూడా ఇదే స్ఫూర్తితో అధిగమించాలని జియం తెలిపారు. ఈ కార్యక్రమములో గుర్తింపు సంఘం ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రవేష్, ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.రమేష్, స్టాటుటరి మేనేజర్ రమేష్ బాబు, మేనేజర్ అనిల్ గబాలే, డిజియం క్వాలిటీ బ్రహ్మాజీ, సియంవోఎఐ ఆర్.జి.1 ఉపాధ్యక్షులు పెరుమాండ్ల శ్రీనివాస్, సీనియర్ సర్వే అధికారి దీటి చంద్రమౌళి, గని క్వాలిటీ ఇంచార్జ్ ఏ.రవి, బేస్ వర్క్ షాప్ ఇంచార్జ్ ఆర్ మహేష్, ఎఐటియుసి ఫిట్ సెక్రటరి గుర్రం ప్రభుదాస్, పీసీ పటేల్ కాంట్రాక్ట్ మేనేజర్ గౌరవ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 10 టన్నుల కుళ్లిన మాంసం సీజ్.. నలుగురి అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 1: నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వఉంచిన ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్ర దారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేక లను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది.

# చండీగఢ్ సిటీ హై అలర్ట్

చండీగఢ్ :చండీగఢ్ నగరంలోని సెక్టార్ 37లో ఉన్న పంజాబ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఇవాళ సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారి గా స్థానికంగా కలకలం రేగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, బీజేపీ కార్యాలయానికి సమీపంలో ఈ పేలుడు జరిగింది. పేలుడు ధాటికి సమీపంలోని భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందాలు అక్కడకు చేరుకుని నమూనాలను సేకరిస్తున్నాయి. ఈ పేలుడుకు గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారా..? లేక ఏదైనా సాంకేతిక కారణాల వల్ల పేలుడు జరిగిందా? అనే కోణంలో చండీగఢ్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. పంజాబ్, హర్యానా ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌లో అత్యంత భద్రత ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం భద్రతా సంస్థలను ఉలిక్కిపడేలా చేసింది. పేలుడు సమాచారం అందిన వెంటనే బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. చండీగఢ్ అంతటా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు, అయితే ఆస్తి నష్టం భారీగానే జరిగినట్లుగా తెలుస్తోంది.



# జిడికె-11వ గని కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించాం

## - ఎఐటియుసి నేతలు రంగు శ్రీను, సిద్దమల్ల రాజు, నాయిని శంకర్ వెల్లడి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 01: సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జిడికె 11వ ఇంక్లైన్ లో కార్మికుల కు చెందిన అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందని, ఇంకా కొన్ని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు రంగు శ్రీను, సిద్దమల్ల రాజు, నాయిని శంకర్ వెల్లడించారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి జిడికె 11వ ఇంక్లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ జిడికె 11వ ఇంక్లైన్ లో పని చేస్తున్న కార్మికుల కు విధులకు హాజరు కావడం కోసం ఓసిపి-5 వల్ల గతంలో టూ ఇంక్లైన్ నుంచి గని కి చేరుకోవడానికి చాలా దూరం తో పాటు, రోడ్డు ప్రమాదంలో చాలా మంది కార్మికులు మృతి చెందడం తో పాటు గాయాల పాలయ్యారని, ఇట్టి సమస్య పరిష్కారం కోసం ఏఐటియుసి యాజమాన్యం తో మాట్లాడి ఓసిపి-5 చెక్ పోస్ట్ నుంచి 11వ ఇంక్లైన్ వరకు కేవలం కార్మికుల సౌకర్యార్థం పాత రోడ్డు పై విధులకు హాజరు కావడం కోసం అనుమతి ఇప్పించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అట్టి రోడ్డు గుంతలు గా ఉందని దాన్ని సి.సి రోడ్డు గా మార్చాలని యాజమాన్యం తో మాట్లాడి పరిష్కారం కోసం కార్పొరేట్ కు నిధుల మంజూరు కోసం నోట్ పంపడం జరిగిందని వారు పేర్కొన్నారు. సి.సి రోడ్డు వచ్చే వరకు బురద కాకుండా కంకర చూర ను పోసేందుకు అర్జీ వన్ యాజమాన్యం అంగీకరించిందని వారు తెలిపారు. అదేవిధంగా టైం రేటెడ్ పోస్టులను కార్మికుల కు ప్రమోషన్స్ ప్రతి సంవత్సరం ఆలస్యం చేయకుండా వెంటవెంటనే ఇప్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. జిడికె 11వ ఇంక్లైన్ లో గత పది సంవత్సరాలుగా రానటువంట సపోర్టుమెన్ మొఖద్దం, టింబర్ మెన్ మొఖద్దం, ట్రామర్ మొఖద్దం, టెండాల్ సూపర్ వైజర్ మరియు ఎల్.హెచ్.డి ఆపరేటర్ ప్రమోషన్ లు ఇప్పించడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా గని లో కార్మికుల కు ఏదైనా ప్రమాదం జరుగుతే హాస్పిటల్ కి వెంటనే వెళ్ళేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా గని పై 24 గంటలు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. అదే విధంగా 11వ ఇంక్లైన్ చెక్ పోస్ట్ నుంచి గని వరకు బి.టి రోడ్డు వేయించడం తో పాటు గని పై లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. గని పై ఉన్న క్యాంటీన్ కు మరమ్మతులు చేయించడం జరిగిందని, వెండర్, కుక్ పోస్ట్ లను భర్తీ చేయడం జరిగిందని, క్యాంటీన్ లో టిఫిన్ ఇండ్లి కి సాంబారు తో పాటు చట్నీ ఏర్పాటు చేయించడం జరిగిందని వారు తెలిపారు. గని పై ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ లను ఎప్పటి కప్పుడు ఫిల్టర్ లను మార్పించడంతో పాటు మెయింటనెన్స్ చేయుటకు యాజమాన్యం తో మాట్లాడి పరిష్కారం చేయడం జరిగిందని వారు తెలిపారు. గనిలో నాలుగో సీం వన్ డిప్ కు కార్మికులు చేరుకునేందుకు చైర్ లిఫ్ట్ తొందరగా ఏర్పాటు చేయాలని అర్జీ వన్ స్ట్రక్చర్ సమావేశాల్లో యూనియన్ అడిగిన మేరకు కర్వ్ స్టేషన్ లో మెటీరియల్ టెండర్ రాలెదని తెలుపగా ఈ విషయాన్ని ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లి డైరెక్టర్ లెవెల్ లో మాట్లాడి టెండర్ వేయించి కర్వ్ స్టేషన్ కు మెటీరియల్ ను తెప్పించడం జరిగిందని, దాని నిర్మాణం పనులు జరుగుతున్నాయని, ఈ వారం లో చైర్ లిఫ్ట్ ప్రారంభం కానుందని వారు పేర్కొన్నారు. గని పై ఉన్న డిన్నర్ షెడ్ కు కార్మికులు భోజనం చేసే సమయంలో కోతులు, కుక్కల బెడద నుంచి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు షెడ్ చుట్టూ ఇనుప జాలి ఏర్పాటు చేయించడం జరిగిందని, అదేవిధంగా వాటర్ ట్యాప్ లు ఏర్పాటు చేయాలని మైన్స్ కమిటీ లో అడుగగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. గని పై వేసవి దృష్ట్యా కార్మికులు ఉక్క పోత తో ఇబ్బందులు పడుతున్నారని ఇరవై ఫ్యాను లు ఈ వారం లో ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని వారు పేర్కొన్నారు. గని పై మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, వాష్ రూముల ఏర్పాటు తో పాటు అండర్ గ్రౌండ్ లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు పని స్థలాల వద్ద టాయిలెట్ లు ఏర్పాటు చేయించడం జరిగిందని వారు తెలిపారు. గని లో అండర్ గ్రౌండ్ లో పని చేస్తున్న ట్రేడ్స్ మెన్ లకు సీనియారిటీ ప్రాతిపదికన సర్ఫేస్ కు పంపాలని యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి వారిని ఓసిపి 5, ఏరియా వర్క్ షాప్, ఏరియా హాస్పిటల్, సివిల్ డిపార్ట్మెంట్, సి.ఎస్.పి తదితర డిపార్ట్మెంట్ లకు పంపించడం జరిగిందని వారు పేర్కొన్నారు. గని పై కార్మికుల వస్తువులను జాగ్రత్త పరచుకోవడం కోసం లాకర్లు ఏర్పాటు చేయాలని ఏరియా లెవల్ స్ట్రక్చర్ సమావేశంలో అడుగగా యాజమాన్యం కార్పొరేట్ కు నోటు పంపగా, డైరెక్టర్ ఫా స్థాయి మీటింగ్ లో కూడా సింగరేణి వ్యాప్తంగా లాకర్లు ఏర్పాటు చేయాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళగా యాజమాన్యం ఏర్పాటు కు అంగీకరించిందని, త్వరలోనే ఏర్పాటు కోసం కృషి చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. గని పై ల్యాంపు రూం ముందు షెడ్ లో ర్యాక్స్ ఏర్పాటు కోసం సివిల్ డిపార్ట్మెంట్ వారు కొలతలు తీసుకోవడం జరిగిందని త్వరలోనే ర్యాక్ లు ఏర్పాటు చేస్తారని వారు పేర్కొన్నారు. గని పై బైక్ పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేయించడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం లో ఏఐటియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సహాయ కార్యదర్శి గొడిశెల నరేశ్, నాయకులు మందల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా

# ఓటమి ఖాయం: మోదీ



గువాహటి: అస్సాం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారనే నమ్మకం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (గ్రావీ వీశీఎఱ) అన్నారు. గోగముఖ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 'ఈసారి ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలు. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి హ్యాట్రిక్ పరాజయం, ఆ పార్టీ యువరాజు రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని, అస్సాంలో బీజేపీని కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నానని పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను మోదీ ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ది పొందుతాయని, ఇంతవరకూ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాతామని, ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# గనుల భూములను పచ్చని ఆస్తులుగా మలిచిన సింగరేణి







(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)- శ్రీ బానోత్ కర్ణ నాయకత్వంలో ఆర్‌జీ-1లో వినూత్న పునరుద్ధరణ, - 100% మొలకెత్తింపు తో పచ్చదనం పరుచుకున్న ఓబీ డుంపులు - శాస్రియ పద్ధతిలో టింబర్ కొనుగోలుతో కంపనికి 1.60 కోట్ల ఆదా- ఓబీ డంప్‌లపై శాస్త్రీయ పునరుద్ధరణలో సింగరేణి విజయ గాధ - ఆర్‌జీ-1 అటవీ విభాగం వినూత్న విధానాలతో పచ్చదనం విస్తరణ -- ప్రజా భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం-సింగరేణిలో పచ్చ విప్లవం- శ్రీ బానోత్ కర్ణ ఆధ్వర్యంలో గనుల భూముల మార్పు-వనమహోత్సవంలో సీఎండీ, ఎమ్మెల్యే, కంపెనీ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు మరియు అధికారులు..

# తృటిలో తప్పిన ముప్పు


## జమ్మూ సరిహద్దులో పాక్ కవ్వింపు చర్య.. భారత డ్రోన్‌పై కాల్పులు!




**న్యూఢిల్లీ,,ఏప్రిల్,01:**అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాకిస్థాన్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూలోని కనాచక్ సెక్టార్‌లో సాధారణ నిఘా నిర్వహిస్తున్న భారత రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ లక్ష్యంగా పాక్ దళాలు కాల్పులు జరిపాయి. అయితే, భారత డ్రోన్‌కు ఎలాంటి నష్టం జరగకపోవడంతో అది సురక్షితంగా వెనక్కి వచ్చింది. పలు నివేదికల ప్రకారం.. నిన్న రాత్రి కనాచక్ సెక్టార్‌లోని భారత భూభాగంలో మన డ్రోన్ సాధారణ నిఘా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సరిహద్దుకు అవతలి వైపు ఉన్న పాకిస్థానీ పోస్టుల నుంచి అకస్మాత్తుగా కాల్పులు ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు రౌండ్ల కాల్పులు జరగగా.. అందులో నాలుగు రౌండ్లు ఖేరీలోని పాకిస్థానీ పోస్ట్ నుంచి, ఒక రౌండ్ అస్లాం పోస్ట్ నుంచి జరిగాయి. భారత డ్రోన్ తన సొంత భూభాగంలోనే ఉన్నప్పటికీ, పాక్ దళాలు కావాలనే దీనిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది పహల్గామ్ దాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి సమయంలో పాక్ జరిపిన ఈ కాల్పులు అత్యంత బాధ్యతారహితమైనవిగా భారత రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ చేస్తున్న ఇలాంటి చిన్నపాటి రెచ్చగొట్టే చర్యలు కూడా పెద్ద ఎత్తున సరిహద్దు ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవల కాలంలో నియంత్రణ రేఖ (ూశీజ) సమీపంలో పాకిస్థానీ డ్రోన్లు, బెలూన్లు తరచుగా కనిపిస్తున్నాయి. భారత సరిహద్దుల్లోకి మాదకద్రవ్యాలు, ఆయుధాలను చేరవేయడానికి పాక్ డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. మరోవైపు, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (ూశీఖ)లోని ఉగ్రవాదులకు పాకిస్థాన్ మద్దతు కొనసాగిస్తూనే ఉంది. పాకిస్థాన్ వరుస కవ్వింపు చర్యల నేపథ్యంలో భారత సైన్యం, జమ్మూ కాశ్మీర్ పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉన్నారు. ఇప్పటికే సరిహద్దు వెంబడి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పాక్ జరిపిన కాల్పులకు భారత దళాలు కూడా ధీటుగా సమాధానం ఇస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఎదురుదాడికి సిద్ధంగా ఉండాలని సరిహద్దు దళాలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

### రెండు నెలలకు సరిపడా

# ముడి చమురు నిల్వలు... కేంద్రం




న్యూఢిల్లీ: రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఎల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు (సౌదీ సీపీ బెంచ్‌మార్క్) 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలు) ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025-26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.

### కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శుభవార్త..

# ఇక నుంచి నేరుగా జీతాలు అకౌంట్లోకే..




**హైదరాబాద్,ఏప్రిల్,01:**తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (×ఖీవీ) ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

## కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజ్ చేతుల మీదుగా భూమిపూజ



తెలంగాణ అవతరణ, (దన్ రాజ్ యాదవ్, పవర్ హౌస్ కాలనీ), 01-04-2026)రి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించనున్న ఇళ్లకు స్థానిక గోదావరిఖని పవర్ హౌస్ కాలనీ 4వ డివిజన్ కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజు, బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి మరో మెట్టు అందింది. కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు అందించడానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం పూర్తి సబ్సిడీగా అందిస్తోందని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఉగ్రవాది హతం



గందర్‌బల్: జమ్మూకాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గందర్‌బల్‌లో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు అప్రమత్తం అయ్యాయి. దీంతో గందర్‌బల్ జిల్లాలోని అర్హామా అటవీ ప్రాంతంలో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. అయితే ఇద్దరు ఉగ్రవాదులు ఎదురుకాల్పులకు దిగడంతో సైన్యం ప్రతిదాడులు చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతం కాగా.. తప్పించుకున్న మరొక ఉగ్రవాది కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని భారత సైన్యం తెలిపింది. బ మేరకు జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బల్ జిల్లాలోని అర్హామా అటవీ ప్రాంతంలో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రకృతి కోసం పోరాడే 'కాట్టాన్'..





తమిళ నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటిస్తున్న తాజా సర్వైవల్ థ్రిల్లర్ 'కాట్టాన్'. ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో మార్చి 27న నేరుగా రాబోతున్న ఈ చిత్రం నుంచి చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. దట్టమైన అటవీ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్ సేతుపతి ఒక పవర్‌ఫుల్ అటవీ నివాసిగా, రగ్గడ్ లుక్‌లో కనిపిస్తూ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, అడవిపై ఆధారపడి జీవించే మనుషుల హక్కుల కోసం ఒక వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం అని తెలుస్తుంది. ట్రైలర్‌లో చూపించిన అద్భుతమైన విజువల్స్, అడవిలోని లోతైన ప్రాంతాల చిత్రీకరణ సినిమాటోగ్రఫీ స్థాయిని తెలియజేస్తుండగా, గ్రిప్పింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదనపు ఆకర్షణగా నిలిచింది. మణికందన్ ఈ సినిమాకు కథను అందించడంతో పాటు బీ. అజిత్ కుమార్ అనే దర్శకుడితో కలిసి సంయుక్తంగా దర్శకత్వం వహించాడు. తమిళంతో పాటు, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది.

# అప్పలసూరిగా జగపతిబాబు



ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

# అల్లు సినిమాస్ స్పెషలేంటంటే...




హైదరాబాద్: భాగ్య నగరం లో సినిమా ప్రేమికులు ఎక్కువ. ఫలానా థియేటర్‌లో మంచి విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుందంటే... ఎంత దూరమైనా ట్రావెల్ చేస్తారు. ఫర్ ఎగ్జాంపుల్... ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లోని పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో సినిమా చూడటం కొందరికి ఓ అలవాటు!టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్ ఉన్న మన సినిమాలను, హాలీవుడ్ మూవీస్‌ను మంచి వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ కోసం పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే ప్రేక్షకులు కొందరు అయితే... వీకెండ్ ఫ్యామిలీతో కలిసి సినిమా చూడాలని ప్లాన్ చేసుకునే వాళ్ళు ఇంకొందరు. ఆ సినీ ప్రేమికుల కోసం హైదరాబాద్ సిటీలో మరొక స్క్రీన్ వచ్చింది. 'అల్లు సినిమాస్'లోని డాల్బీ సినిమా స్క్రీన్. దాని స్పెషాలిటీ ఏమిటి? అందులో సినిమా ఎందుకు చూడాలి? అంటే... ఇప్పటి వరకు హైదరాబాద్ సిటీలోని పలు థియేటర్లలో మీరు త్రీడీ సినిమా చూసి ఉండొచ్చు. అయితే... ఒక్కసారి 'అల్లు సినిమాస్'లోని స్క్రీన్ 1 (డాల్బీ సినిమా)లో త్రీడీ ఫిల్మ్ చూడండి. 'ది బెస్ట్ సినిమాటిక్' ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో అసలు సందేహం అవసరం లేదు. టాలీవుడ్ జర్నలిస్టులను అల్లు సినిమాస్ (థియేటర్ విజిట్)కు తీసుకు వెళ్ళారు. సీతా రాములుగా సాయి పల్లవి, రణబీర్ కపూర్... రావణుడిగా యశ్ నటిస్తున్న 'రామాయణ' గ్లింప్స్ ప్రదర్శించారు. త్రీడీ వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ సూపర్బ్ అని చెప్పాలి.'అల్లు సినిమాస్'లోని 'డాల్బీ సినిమా' స్క్రీన్‌లో మెయిన్ ఎట్రాక్షన్ ఒ స్పెషాలిటీ... సౌండ్ క్వాలిటీ. థియేటర్ టోటల్ సీటింగ్ కెపాసిటీ 634. ఇందులో టోటల్ 78 స్పీకర్స్, 165 సౌండ్ ఔట్ లెట్స్ ఉన్నాయి. ప్రస్తుతానికి (మార్చి 12, 2026)కు ఇండియాలోని అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ ఇదే. హైదరాబాద్ సిటీలో మొట్టమొదటి స్క్రీన్ కూడా! ఇది ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా ఆడిటోరియం కూడా!'అల్లు సినిమాస్' డాల్బీ సినిమా స్క్రీన్‌లో సౌండ్ క్వాలిటీ సూపర్బ్ అని చెప్పవచ్చు. వరల్డ్ క్లాస్ లెవల్ హియరింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ప్రతి చిన్న సౌండ్, బీట్ చాలా స్పష్టంగా వినబడుతుంది. అందువల్ల ఆర్ఆర్ (నేపథ్య సంగీతం) పరంగా ఈ స్క్రీన్ నెక్ట్స్ లెవల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.

విజువల్ ఎక్స్‌పీరియన్స్ కూడా సూపర్బ్: ప్రపంచంలోని అతి పెద్ద స్క్రీన్‌లలో అల్లు సినిమా డాల్బీ సినిమా స్క్రీన్ ఒకటి. ఈ స్క్రీన్ సైజ్ 75 అడుగుల వెడల్పుతో ఉంది. ఫ్లాట్ యాస్పెక్ట్ రేషియోలో ఇందులో సినిమాలను ప్రదర్శించనున్నారు. ఇండియాలో ఇంత పెద్ద డాల్బీ సినిమా స్క్రీన్, హైదరాబాద్‌లోనూ ఇంతకు ముందు లేదు. డాల్బీ సినిమా డిజైన్ ప్రమాణాల ప్రకారం... డ్యూయల్ డాల్బీ విజన్, 6ఖ లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్ కలిగి ఉంది. ఎక్స్‌ట్రీమ్ బ్రైట్ నెస్, డీపర్ బ్లాక్స్, రిచ్‌లీ వైబ్రెంట్ కలర్స్‌తో ఈ సినిమా హాలులో విజువల్ క్వాలిటీ కూడా ది బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో సందేహం అవసరం లేదు.ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా స్క్రీన్ కాకుండా 'అల్లు సినిమాస్'లో మరో మూడు స్క్రీన్‌లు ఉన్నాయి. వాటిలో బార్కో 4ఐ లేజర్ ప్రొజెక్షన్, డాల్బీ అట్మోస్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి. ఆ మూడింటి సీటింగ్ కెపాసిటీ 717 సీట్లు.

# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్–అర్జున్ సంగీతాన్ని అందించారు.

## డేట్స్ కుదరక దురంధర్ వదులుకున్నా

# సీనియర్ నటుడు అనిల్ కపూర్ వెల్లడి



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'ధురంధర్ 2' రణ్‌వీర్ సింగ్ ప్రధానపాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో తాను అతిథి పాత్ర వదులుకోవాల్సి వచ్చిందని బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ సినిమాలో ఓ కీలక అతిథి పాత్ర కోసం ఆదిత్య నన్ను సంప్రదించారు. అందులో నటించాలని నేనూ కోరుకున్నా. కానీ, ఆ సమయంలో అప్పటికే మరో దర్శకుడికి డేట్స్ ఇచ్చేశాను. దీంతో 'ధురంధర్ 2'లో నటించలేకపోయాను. ఒకరికి ఇచ్చిన డేట్స్‌ను క్యాన్సిల్ చేసి.. మరో సినిమాను అంగీకరించడం సమంజసం కాదు. అందులో నటించే అవకాశం కోల్పోవడం నా దురదృష్టమే.. కానీ నా బాధ్యత ముందు ఇది చిన్న విషయం. నాకు వృత్తిపై ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. చిత్రపరిశ్రమలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు. ఇచ్చిన మాట మీద నిలబడటం చాలా ముఖ్యం అని అనిల్ కపూర్ చెప్పారు. భవిష్యత్తులో ఆదిత్య సినిమాలో నటించే అవకాశం రావాలని కోరుకున్నారు. 'ధురంధర్' సూపర్ హిట్ కావడంతో దీని సీక్వెల్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ప్రీబుకింగ్స్‌లో ఈ చిత్రం హవా చూపిస్తోంది. ఇప్పటి వరకూ కేవలం పెయిడ్ ప్రీమియర్స్, అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే రూ.27 కోట్లు వసూళ్లు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ 5లక్షలకు పైగా టికెట్స్ సేల్ అయినట్లు తెలుస్తోంది. ఇంకా విడుదలకు సమయం ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 9530 థియేటర్స్‌లో ఈ చిత్రం విడుదల కానుంది.

# సముద్ర ఖని కార్మేని సెల్వం

నేటి ఆధునిక కాలంలో డబ్బు, కుటుంబం మరియు మనుషుల ఆశయాల చుట్టూ తిరిగే ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా, రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళంలో రూపొందిన ఈ ద్విభాషా చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సముద్రఖని కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్ర పోషించగా, లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ప్రముఖ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, యువరాజ్ దక్షన్ ఛాయాగ్రహణం అందించారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అంటూ విలక్షణ నటుడు సముద్రఖని చెప్పే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ఈ టీజర్, నేటి సమాజంలో ఉన్న ఆర్థిక సవాళ్లను కళ్ళకు కట్టినట్లు చూపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ కల్చర్, ఈఎంఐల భారం, క్రిఎ÷–టో పెట్టుబడులు మరియు త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు మధ్యతరగతి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఇందులో అర్థవంతంగా చూపించారు. సముద్రఖని తన కుటుంబంతో గడిపే హృద్యమైన సన్నివేశాలు ఒకవైపు, విదేశాల్లో ఒంటరిగా కనిపించే దృశ్యాలు మరోవైపు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. టీజర్ చివర్లో 'రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి? డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి' అని సముద్రఖని చెప్పే డైలాగ్ నేటి వినియోగదారి




తత్వానికి అద్దం పడుతోంది. సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ విలువలతో రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411